సాక్షి ప్రకాశం

మంగళవారం । 14 । మార్చి । 2023



క్షణికావేశం.. తీరని శోకం

భార్య, భర్తల మధ్య స్వల్ప వివాదంలో క్షణికావేశంతో ఓ తల్లి తన ముగ్గురు పిల్లలకు అన్నంలో ఎలుకల మందు పెట్టి తానూ తినింది. కుమారుడు మరణించగా, కుమార్తెలు చికిత్స పొందుతున్నారు. - 8లో..



ఫెన్సింగ్ ఓవరాల్ ఛాంపియన్ ప్రకాశం

కాకినాడలో జరిగిన అంతర్ జిల్లాల ఉమెన్ ఫెన్సింగ్ పోటీల్లో ప్రకాశం జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
33 /22

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఓటేసిన మంత్రి సురేష్



ఓటు వేసినట్లు చూపుతున్న మంత్రి సురేష్, ఆయన తనయుడు విశాల్

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో సోమవారం తన ఓటును సద్వినియోగం చేసుకున్నారు. మంత్రితోపాటు ఆయన తనయుడు, జార్జి విద్యాసంస్థల చైర్మన్ ఆదిమూలపు విశాల్ ఓటు వేశారు.

కొత్త ఒరవడికి శ్రీకారం చుడతాం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరులో ఓటు వేసిన చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (సెంట్రల్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి కొత్త ఒరవడికి శ్రీకారం చుడతానని వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరులోని డీకేడబ్ల్యూ ఆయన కళాశాలలో ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రైవేట్ ఉపాధ్యాయులను గుర్తించి ఓటు హక్కు కల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో ఒక యూనియన్ సభ్యులే గెలుస్తూ వచ్చారన్నారు. ఈసారి పరిస్థితి మారబోతుందన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. విప్లవాత్మక మార్పులు తెచ్చిందని గుర్తుచేశారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు

ఒంగోలు: పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం జరిగిన శాసనమండలి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నందుకు, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన జిల్లా పోలీసు యంత్రాంగానికి, ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేందుకు కృషి చేసిన వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు, కార్యకర్తలకు నమస్కారాలు తెలిపారు.

19న మట్టిబండి కావ్యం ఆవిష్కరణ

ఒంగోలు: నాగభైరవ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఈనెల 19న స్థానిక అంబేద్కర్ భవన్‌లో మట్టిబండి కావ్యావిష్కరణ చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి తేళ్ల అరుణ అధ్యక్షులుగా వ్యవహరిస్తారని, డాక్టర్ నూనె అంకమ్మరావు సంచాలకత్వంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

దామచర్ల దాదాగిరీ!

ప్రశాంతంగా జరుగుతున్న మండలి ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ నేతలు రెచ్చగొట్టే, కవ్వింపు చర్యలకు దిగారు. సోమవారం జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. ఓటమి భయంతో ఒంగోలు నగరంలో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దౌర్జన్యానికి దిగారు. తన అనుచరులతో పలు పోలింగ్ కేంద్రాల వద్ద అలజడి సృష్టించారు. ఏకంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని బలవంతంగా బయటకు తీసుకెళ్లి దాదాగిరీని ప్రదర్శించారు. సాయంత్రం మీడియా సమావేశం పెట్టి ఆ నెపాన్ని అధికార వైఎస్సార్ సీపీపై నెట్టే ప్రయత్నం చేశారు.

- ఓటమి భయంతో రెచ్చగొట్టే చర్యలు
- పోలింగ్ బూత్‌ల వద్ద మాజీ ఎమ్మెల్యే దామచర్ల దౌర్జన్యం
- నిబంధనలు ఉల్లంఘించి మరీ అనుచరులతో హల్‌చల్
- ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేసే కుట్ర
- మీసాలు తిప్పుతూ, తొడలు కొడుతూ కవ్వింపు చర్యలు
- పోలీస్ స్టేషన్‌లో సైతం దౌర్జన్యం
- ఎస్‌హెచ్‌ఓ లేని సమయంలో అందులో ఉన్న టీడీపీ నేతను బలవంతంగా ఎత్తుకెళ్లిన వైనం



సెయింట్ థెరిస్సా పోలింగ్ కేంద్రం వద్ద డీఎస్పీతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు : జిల్లాలో సోమవారం ఒక వైపు శాసన మండలి ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతుంటే మరో వైపు వాటిని భగ్నం చేసేందుకు టీడీపీ నేతలు యత్నించారు. ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తాను కష్టపడ్డానని తమ అధిష్టానానికి చెప్పుకునేందుకు కుయుక్తులు పన్నారని సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. తూర్పు రాయలసీమ (చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం) జిల్లాల్లో జరుగుతున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను మాజీ మంత్రి, రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అన్ని తానై నెలరోజులుగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన విషయం తెలిసిందే. అదే జరిగితే ఇక తాను సొంత పార్టీలో సైతం జీరో కాక తప్పదని భయపడిన దామచర్ల ఉనికి కాపాడుకునేందుకు కుట్రలకు తెరతీశారు. ఇందుకు కార్యకర్తలను బలిపశువుల్ని చేసేందుకు కూడా వెనుకాడక పోవడం గమనార్హం. పోలింగ్ శాతం తగ్గిస్తే వైఎస్సార్‌సీపీ మెజార్టీని అడ్డుకోవచ్చనే కుట్రతో నగరంలో పలు పోలింగ్ కేంద్రాల వద్ద తమ అనుచరులతో కవ్వింపు చర్యలకు దిగుతూ గొడవలు సృష్టించేందుకు యత్నించారు. నగరంలోని సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాల వద్ద టీడీపీ కార్యకర్త కాకర్ల ఈశ్వర్ వైఎస్సార్‌సీపీ మహిళ నేతలు, కార్యకర్తల వద్దకు వచ్చి మీసం తిప్పుతూ, తొడగొడుతూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఒకదశలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దూసుకొచ్చే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని ఇరువురినీ చెదరగొట్టారు. అక్కడి నుంచి టీడీపీ కార్యకర్తలు వెళ్లకపోవడంతో గొడవకు కారకుడైన కాకర్ల ఈశ్వర్‌ను ప్రివెంటివ్ అరెస్టు చేసి టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మాజీ మంత్రి బాలినేని మాత్రం గొడవలు వద్దంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులను సంయమనపరిచి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు.

పోలింగ్ కేంద్రాల వద్ద జనార్దన్ హల్‌చల్

కార్యకర్తలు, నేతలతో కవ్వింపు చర్యలకు పాల్పడ్డా వైఎస్సార్‌సీపీ నేతల సంయమనంతో గొడవలు జరగడం లేదని గ్రహించిన దామచర్ల నేరుగా రంగంలో దిగారు. పదుల సంఖ్యలో వాహనాలు, భారీగా అనుచరులతో పోలింగ్ కేంద్రాల వద్దకు నేరుగా వచ్చి నిబంధనలకు విరుద్ధంగా హల్‌చల్ చేశారు. పోలీసులు వద్దని వారించినా వినకుండా వారిపై దుర్భాషలాడుతూ కార్యకర్తలతో నినాదాలు చేయిస్తూ హైడ్రామా చేశారు. సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాల, శర్మ కాలేజీ, ఆంధ్రకేసరి విద్యా కేంద్రం తదితర పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి నినాదాలు చేస్తూ ఉద్రిక్తతలు సృష్టించే కుట్రలకు తెగబడ్డారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పోలింగ్ బూత్‌లకు దూరంగా ఏర్పాటు చేసిన కేంద్రాల వద్దకు వెళ్లిన ప్రతిసారి అక్కడకు దామచర్ల వెళ్లి కార్యకర్తలతో గొడవలకు దిగేందుకు కుయుక్తులు పన్నినా వైఎస్సార్‌సీపీ కేడర్ సంయమనంతో ఎక్కడా గొడవలు జరగకుండా చూశారు. దీంతో ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించి తలలు పట్టుకుని కూర్చున్న జనార్దన్ అండ్ కో సాయంత్రానికి ప్రెస్‌మీట్‌లు పెట్టి వైఎస్సార్‌సీపీ నేతలు దౌర్జన్యాలకు తెగపడ్డారంటూ బురదజల్లే ప్రయత్నాలు చేశారు. అయితే ఉదయం నుంచి జరుగుతున్న తతంగాన్ని నేరుగా చూసిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు టీడీపీ తీరుపై మండిపడుతున్నారు.

పోలీసుల అదుపులో ఉన్న టీడీపీ కార్యకర్త కాకర్ల ఈశ్వర్‌ను బలవంతంగా తీసుకెళ్లారంటూ కానిస్టేబుల్ మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో పాటు మరో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కులంపేరుతో దూషించి కొట్టారంటూ ఫిర్యాదు:

కుమార్తెను ఓటు వేయించేందుకు తీసుకెళ్తుంటే తనను టీడీపీ నాయకులు కులం పేరుతో దూషించి కొట్టారంటూ ఇందిరా కాలనీకి చెందిన చింతగుంట్ల సువర్ణ స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం ఆమె తన కుమార్తెను సెయింట్ థెరిస్సా పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేయించేందుకు వారి సమీప ప్రాంత వాసి మరియమ్మతో కలిసి పోలింగ్ స్టేషన్ వద్దకు వెళుతోంది. ఈ సమయంలో వారిని టీడీపీ నాయకులు, కొంతమంది రౌడీలు చూసి అడ్డుకున్నారు. అనంతరం కులంపేరుతో దూషించి తీవ్రంగా అవమానించారని పేర్కొంటూ టీడీపీ నాయకులు బండారు మదన్, కొఠారి నాగేశ్వరరావు, కపిల్ బాషా, అజిమున్నీసా, ఆళ్ల వెంకటరత్నం, కాకర్ల ఈశ్వర్, కాట్రగడ్డ రాము, ఎద్దు శశికాంత్ భూషణ్ తదితరులపై ఫిర్యాదు చేశారు.

ఒన్‌టౌన్ పీఎస్‌లో మరో రెండు ఎస్సీ, ఎస్టీ కేసులు

స్థానిక ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలపై మరో రెండు ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదయ్యాయి. స్థానిక జక్రయ్య హాస్పిటల్ సమీప నివాసి కొమ్ము సామ్యేలు కథనం ప్రకారం.. అతని కుమార్తె అనూష 73వ బూత్ ఏజెంటుగా ఉన్నారు. శర్మా కాలేజీ గేటు వద్ద కుమార్తె కోసం వేచి ఉండగా.. కొక్కిలిగడ్డ చిన్న దివాకర్ అనే అతను సామ్యేలు వద్దకు వచ్చి "నీకు ఏమి పని, ఓట్లు అడుగుతున్నావంటూ" గొడవపడ్డారు. ఈ సమయంలో పాలూరి వెంకటేశ్వరరెడ్డి, అతని కుమారుడు సాయికుమార్‌రెడ్డి, పప్పు శ్రీను, తూము సుబ్బారావు, తూము రాజేష్, జూటూరి కృష్ణ, గుర్రాల రాజ్‌విమల్, మరికొంతమంది సామ్యేలుపై దాడిచేయగా వారిలో కొంతమంది కులంపేరుతో దూషించి అవమానించారు. కులం "తక్కువవాడివి నీకెందుకురా రాజకీయం" అంటూ అవమానించారని, ఈ సమయంలో కార్పొరేటర్ మరి కొంతమంది వచ్చి సామ్యేలును అక్కడ నుంచి పంపించివేశారు. సామ్యేలు అక్కడ నుంచి వెళ్తుండగా మళ్లీ కనిపిస్తే చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో వారి వల్ల తనకు ప్రాణహాని ఉన్నట్లు సామ్యేలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దాడితోపాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో నిందితునిగా ఉన్న కొక్కిలిగడ్డ చిన్న దివాకర్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ పోలీసులకు మరో ఫిర్యాదు చేశాడు. తాను శర్మా కాలేజీలో టీడీపీ రిలీవ్ పోలింగ్ ఏజెంటుగా ఉన్నానని, శర్మా కాలేజీ గేటువద్ద ఉన్న తనను కార్పొరేటర్లు వెంకటేష్, ఇమ్రాన్, విస్సు, అనీల్ అనేవారు అక్కడ నుంచి వెళ్లిపోవాలంటూ కర్రతో కొట్టి గాయపరిచారని పేర్కొన్నారు. చుట్టుపక్కల వారు వచ్చి తనను తప్పించడంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. దీంతో దివాకర్ ఫిర్యాదుపై కూడా మరో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది.

మహిళలని కూడా చూడకుండా కొట్టారు:

మహిళలని కూడా చూడకుండా తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఇష్టం వచ్చినట్లు కొట్టారంటూ నక్కల లీలాకుమారి రిమ్స్‌లో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోతంశెట్టి వెంకటరత్నం తమ బంధువును ఓటు వేయించేందుకు పోలింగ్‌బూత్ వద్దకు వెళుతున్న సమయంలో టీడీపీ నాయకురాలు అజిమున్నీసా, ఆళ్ల వెంకటరత్నంలు దాడిచేసి కొట్టడం ప్రారంభించారు. దీంతో సమీపంలో ఉన్న నక్కల లీలాకుమారి, చింతగుంట్ల హరికృష్ణలు అడ్డం వెళ్లారు. దీంతో టీడీపీ నాయకులు కపిల్‌బాషా, ఈశ్వర్‌లు అక్కడకు చేరుకున్నారు. లీలాకుమారి ధరించిన దుస్తులను బలవంతంగా లాగివేస్తున్న కపిల్‌బాషా చర్యలను హరికృష్ణ అడ్డుకోవడంతో కాకర్ల ఈశ్వర్ భౌతిక దాడులకు దిగాడు. ఈ దాడిలో గాయపడిన పోతంశెట్టి వెంకటరత్నం, లీలాకుమారి, చింతగుంట్ల హరికృష్ణ ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కనీసం మహిళలని కూడా చూడకుండా దాడిచేసి కొట్టారంటూ కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఈ విషయం తెలియడంతో పలువురు బీసీ, ఎస్సీ నాయకులు రిమ్స్‌కు చేరుకుని బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

పోలీస్‌స్టేషన్‌లో సైతం దౌర్జన్యం

సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద గొడవ సృష్టించేందుకు యత్నించిన టీడీపీ కార్యకర్త కాకర్ల ఈశ్వర్‌ను సోమవారం ఉదయం పోలీసులు ప్రివెంటివ్ అరెస్టు చేసి టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వరకు పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా హల్ చల్ చేసిన దామచర్ల ఇక సీన్‌ను పోలీసు స్టేషన్‌కు మార్చారు. సీఐ రాఘవరావు పోలీసు స్టేషన్‌లో లేని సమయంలో స్టేషన్‌కు వెళ్లి పోలీసుల అదుపులో ఉన్న తమ కార్యకర్త ఈశ్వర్‌ను బలవంతంగా బయటకు తీసుకొచ్చారు. పోలీసు కానిస్టేబుళ్లు వారిస్తున్నా వినకుండా తన కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు. దీనికి ముందు డీఎస్పీ, సీఐ ఫోన్‌లో తాము పంపుతామని చెప్పినా ఏకవచనంతో బెదిరింపు ధోరణితో మాట్లాడుతూ నేను తీసుకెళుతున్నా ఏం చేస్తారో చేసుకోండంటూ బలవంతంగా ఈశ్వర్‌ను కారులో తీసుకుపోయారు. అంతే కాకుండా పోలీసు స్టేషన్‌లో పోలీసులకు వ్యతిరేకంగా నినదాలు చేస్తూ హంగామా సృష్టించారు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని దౌర్జన్యంగా తీసుకెళ్లడం చూస్తుంటే దామచర్ల పోకడ ఏవిధంగా ఉందనేది జిల్లా ప్రజలకు అర్థమవుతోంది.



గొడవ చేసిన టీడీపీ కార్యకర్త కాకర్ల ఈశ్వర్



సంయమనం పాటించి పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలని కార్యకర్తలకు సూచిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి



సెయింట్ థెరిస్సా హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం

పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నేత హల్‌చల్

- దురుసుగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే ఉగ్ర
- రచ్చకు దిగిన టీడీపీ శ్రేణులు



పోలీసులను నెట్టి, గేట్లు తొసుకుని పోలింగ్ కేంద్రం లోకి దూసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయంతో టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పోలింగ్ కేంద్రాల వద్ద రచ్చ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు శ్యాం ప్రసాద్‌రెడ్డికి, పర్వతరెడ్డి చంద్ర శేఖరరెడ్డిలకు ఎక్కువ శాతం ఓట్లు పోల్ అవుతుండటంతో ఆక్రోశం పట్టలేక తగదా పెట్టుకుని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. అందులో భాగంగా సోమవారం మరో గంటలో ఎన్నికలు ముగుస్తాయనే సమయంలో టీడీపీ నేత ఉగ్ర తన అనుచరులతో వచ్చి రచ్చ రచ్చ చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై అకారణంగా దాడికి యత్నించారు. వైఎస్సార్ సీపీ ద్వితీయ శ్రేణి ముఖ్య నాయకులే టార్గెట్‌గా గొడవకు దిగారు. కేవలం ఓటింగ్ సరళిని దెబ్బతీసేందుకే ఒక్కసారిగా టీడీపీ శ్రేణులు మూకుమ్మడిగా వచ్చి పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులను పరుష పదజాలంతో దూషించారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య కొంత తోపులాట జరిగింది. పోలీసులు ఎంత సర్ది చెప్తున్నా వినకుండా టీడీపీ శ్రేణులు మరింత రెచ్చిపోయి ప్రవర్తించారు. గేట్లు నెట్టి పోలింగ్ కేంద్రంలోకి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. దీంతో సీఐ ఆధ్వర్యంలో పోలీస్ బృందం భారీగా మొహరించి గుంపులను చెదరకొట్టారు. దీంతో సమస్య సద్దుమణిగింది.







ఓటు వేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్, ఓటు వేసినట్లు చూపుతున్న ఎంపీ మాగుంట



పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్



కొనకనమిట్లలో ఓటు వేసేందుకు బారులుతీరిన ఓటర్లు



ఒంగోలులో ఓటు వేసేందుకు వెళ్తూ చంటి బిడ్డను మహిళా పోలీసుకు అప్పగించి వెళ్తున్న తల్లి



పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

మండలి పోరు..ఓటెత్తారు !



ఒంగోలు సెయింట్ జేవియర్స్ హైస్కూల్లో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరడంతో సాధారణ ఎన్నికల వాతావరణాన్ని తలపించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మండలి ఎన్నికల్లో పెద్ద ఎత్తున పోలింగ్ జరగడం గమనార్హం. కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్‌లు పోలింగ్ జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. ఒకటీ రెండు చోట్ల టీడీపీ నేతల అత్యుత్సాహం మినహా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.

- అసెంబ్లీ ఎన్నికలను తలపించిన పోలింగ్
- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- కొన్ని కేంద్రాల్లో మందకొడిగా..
- పోలింగ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- ఒంగోలులో ఓటు వేసిన కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎంపీ మాగుంట
- మార్కాపురంలో అత్యధిక పోలింగ్ శాతం నమోదు

ఒంగోలు సబర్బన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియ ప్రశాతంగా ముగిసింది. జిల్లాలోని 138 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. కొన్ని కేంద్రాల్లో మధ్యాహ్నం వరకూ ఓటర్లు నామమాత్రంగా కనిపించారు. ఉదయం నుంచే భానుడి ప్రతాపం తీవ్రంగా ఉండటంతో పోలింగ్ మందకొడిగా సాగింది. ఒంగోలు నగరంలో ఉష్ణోగ్రత మధ్యాహ్నం 33 నుంచి 35 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి కేటాయించిన 40 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల వరకు 24.63 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 55.05 శాతం పోలింగ్ అయింది. పట్టభద్రుల పోలింగ్ కేంద్రాల వద్ద చాలా చోట్ల మందకొడిగా ప్రారంభమైంది. 98 కేంద్రాల్లో ఉదయం 10 గంటలకు కేవలం 11.37 శాతం పోలింగ్ మాత్రమే జరిగింది. మధ్యాహ్నం 12 గంటల వరకు మందకొడిగా సాగి 28.62 శాతం నమోదైంది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ పూర్తయ్యే సరికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు 91.40 శాతం పోలింగ్ జరిగింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులకు 69.37 శాతం నమోదైంది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ:

జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్‌లు పరిశీలించారు. అక్కడ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వచ్చారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని అనేక పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను కూడా ఎస్పీ మలికాగర్గ్ పరిశీలించి వారికి తగిన సూచనలు చేశారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ కూడా పోలింగ్ స్టేషన్లు పరిశీలించి సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.మహిళా ఓటర్లు సైతం పోలింగ్‌లో పాల్గొన్నారు. వృద్ధులు, వికలాంగులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓట్లు వేసిన ప్రముఖులు...

శాసన మండలి ఎన్నికల సందర్భంగా ఒంగోలులో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డితో పాటు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, నగర మేయర్ గంగాడ సుజాత ఓటు వేసిన వారిలో ఉన్నారు.

మార్కాపురంలో అధికం

ఒంగోలు అర్బన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మార్కాపురంలో ఎక్కువ శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 91.40 శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 69.37 శాతం నమోదైంది. ఉపాధ్యాయ నియోజవర్గానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 40 పోలింగ్ కేంద్రాలు, 5,789 మంది ఓటర్లు ఉండగా మార్కాపురం డివిజన్‌లో 93.71 శాతం, కనిగిరి డివిజన్‌లో 93.72 శాతం, ఒంగోలు డివిజన్‌లో 88.70 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తం 98 పోలింగ్ కేంద్రాలు, 82,225 మంది ఓటర్లు ఉన్నారు. మార్కాపురం డివిజన్‌లో 70.28 శాతం, కనిగిరి డివిజన్ 67.91 శాతం, ఒంగోలు డివిజన్‌లో 69.37 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సరాసరిన జిల్లా వ్యాప్తంగా 69.37 శాతం నమోదైంది. కలెక్టరేట్ కంట్రోలు రూము నుంచి కలెక్టర్ దినేష్ కుమార్ పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను పీవీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి చిత్తూరు స్ట్రాంగ్ రూముకు తరలించనున్నారు. కలెక్టర్ రిసెప్షన్ కేంద్రాన్ని పరిశీలించి చిత్తూరు తరలించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను సంబంధిత అధికారులకు సూచించారు.

పోలింగ్ శాతం:

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ:	పట్టభద్రుల ఎమ్మెల్సీ:
91.40	69.37

పోలింగ్ కేంద్రాలు:

మొత్తం పోలింగ్ కేంద్రాలు:	138
ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి:	పట్టభద్రుల ఎమ్మెల్సీకి:
40	98

క్లుప్తంగా

దొంగ నోట్ల చలామణి కేసు.. నిందితులకు ఐదేళ్ల జైలు

- పోలీస్ సిబ్బందిని ప్రశంసించిన ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు: దొంగనోట్లను చలామణీ చేస్తూ పట్టుబడిన నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ మలికాగర్గ్ సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. 2017 ఆగస్టు 6న టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద టోల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న యనమదల రాజేష్ వాహనచోదకులకు మూడు రూ.500 నకిలీ కరెన్సీ నోట్లు ఇచ్చినట్లు టోల్‌ప్లాజా షిఫ్ట్ ఇన్‌చార్జి చవటపాలెం రామానుజం దృష్టికి వచ్చింది. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టంగుటూరు ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. అప్పటి సింగరాయకొండ సీఐ భీమానాయక్ దర్యాప్తు చేపట్టి జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటకు చెందిన వై.రాజేష్, చిరుమామిళ్ల గోపీకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తదనంతరం సీఐ దేవప్రభాకర్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.పద్మజ ప్రాసిక్యూషన్ తరఫున కోర్టులో వాదించి నిందితులను దోషులుగా నిరూపించారు. దీంతో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.జయలక్ష్మి నిందితులు ఇరువురికీ ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. టంగుటూరు ఎస్సై సీహెచ్.వెంకటేశ్వర్లు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ పి.దాసు తదితరులను ఎస్పీ అభినందించారు.

స్పందించిన హృదయాలు

- ఇంతియాజ్ వైద్యానికి సుమారుగా రూ.10 లక్షల విరాళం
- 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన బాధితుడి తల్లిదండ్రులు



చికిత్స పొందుతున్న ఇంతియాజ్

సాక్షి ఎఫెక్ట్..

పీసీపల్లి: పశువుకు వైద్యం చేస్తున్న క్రమంలో తీవ్రంగా గాయపడిన యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ షేక్ ఇంతియాజ్ వైద్యానికి దాతలు స్పందించి చేయూతనందించారు. పీసీపల్లి మండలం మురుగమ్మి సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న కనిగిరి వాసి ఇంతియాజ్ దీనగాథపై శనివారం 'సాక్షి'లో 'విధి ఆడిన ఆట.. తడబడిన మాట' శీర్షికన ప్రచురితమైన కథనానికి దాతలు, సహోద్యోగులు వేగంగా స్పందించారు. ఆపరేషన్‌కు రూ.6 లక్షలకు పైగా అవసరం కాగా విరాళాల రూపంలో రూ.10 లక్షలు సమకూరాయి. దాతలతోపాటు 'సాక్షి'కి బాధితుడి తల్లిదండ్రులు మీరావళి, పాశ్చాబీ కృతజ్ఞతలు తెలిపారు. ఫోన్ పే నంబర్‌కు రూ.3.70 లక్షలు, పశువైద్యశాల పేరోల్ సిబ్బంది రూ.లక్ష, మిగిలిన మొత్తం ప్రకాశం జిల్లా అసోసియేషన్ తరఫున సమకూరాయని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి వివరించారు. ఇంతియాజ్ పరిస్థితి చూసి స్పందించిన వారికి జేడీఏ కృతజ్ఞతలు తెలిపారు.



పొదిలిలో దివ్యాంగుడిని ఓటు వేసేందుకు తీసుకెళ్తున్న కానిస్టేబుల్



ఒంగోలు సెయింట్ జేవియర్స్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న ఓటర్లు



బ్యాలెట్ బాక్సులను ఒంగోలు పీవీఆర్ హైస్కూల్ రిసెప్షన్ కేంద్రానికి తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్ ప్రశాంతం

తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల పోలింగ్ జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఒంగోలు, కనిగిరిలో చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. వైఎస్సార్ సీపీ, టీడీపీ ముఖ్య నేతలతోపాటు పీడీఎఫ్ ప్రతినిధులు పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



కనిగిరి పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే బుర్రా, ఇతర నేతలు



పీసీపల్లిలో చిన్నారిని లాలిస్తున్న కానిస్టేబుల్



పెద్దదోర్నాలలో పోలింగ్ సరళిపై పార్టీ నేతలతో సమీక్షిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



మద్దిపాడులో ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



కొమరోలులో దివ్యాంగ టీచర్‌కు సహాయం..



మద్దిపాడులో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



తాళ్లూరులో ఎంపీపీ, జెడ్పీటీసీలకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



కొండపిలో చంటిబిడ్డతో కలిసి ఓటేసేందుకు వచ్చిన మహిళ



బేస్తవారిపేటలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు



పొదిలిలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



బ్యాలెట్ బాక్సులు భద్రపరుస్తున్న ఎన్నికల సిబ్బంది



ఓటుహక్కు వినియోగించుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



సతీమణితో కలిసి ఓటేసిన ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి



సింగరాయకొండలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న వరికూటి అశోక్‌బాబు

ఫెన్సింగ్ ఓవరాల్ ఛాంపియన్ ప్రకాశం

ఒంగోలు: కాకినాడలో నిద్రోణ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 10,11 తేదీల్లో జరిగిన 9వ రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఫెన్సింగ్ పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ మేరకు విజేతలను సోమవారం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు వి.నాగేశ్వరరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్ జి.రాజరాజేశ్వరి, ఒలంపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కూనపురెడ్డి శివ, కోశాధికారి ఐనాబత్తిన అంజలి, జిల్లా ముఖ్య కార్యదర్శి జి.నవీన్‌లు అభినందించారు.

వ్యక్తిగత విభాగం: టి.యశ్వంత్(టంగుటూరు, సాబర్ విభాగం బంగారు పతకం).

టీమ్ విభాగం:

సాబర్ విభాగం బాలికలు–బంగారు పతకం

కె.నాగజాహ్నవి, ఆర్.విజయలక్ష్మి, ఆర్.కీర్తన, జి.రోజా(ఒంగోలు)

సాబర్ విభాగం బాలురు– బంగారు పతకం

టి.యశ్వంత్(టంగుటూరు), కెవీ సత్యసాయి(ఒంగోలు), ఎస్.వంశీప్రదీప్‌యాదవ్(చీరాల), యం.నాగేశ్వరరావు(కనిగిరి)

ఫాయిల్ విభాగం బాలికలు– రజిత పతకం



సత్తా చాటిన జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారులు

టి.విజయలక్ష్మి, పీడీఎస్ సుశీల, కె.సాయిసేవిత(ఒంగోలు), కె.తనూజ(లింగంగుంట)

ఫాయిల్ విభాగం బాలురు– కాంస్య పతకం

డి.రాజా(కందులూరు), టి.జయంత్‌రెడ్డి(ఒంగోలు), కె.వెంకటేశ్వర్లు(బల్లికురవ), డి.శ్రీనివాసులు(సీఎస్‌పురం)

ఈపీ విభాగం బాలికలు– బంగారుపతకం

ఆర్.కీర్తి, ఓ.మౌనిక(ఒంగోలు), పి.తనుశ్రీ(కంభం), ఎం లావణ్య(కందుకూరు)

ఈపీ విభాగం బాలురు– రజత పతకం

జి.మణితేజ చౌదరి(ఒంగోలు), ఎం ఆదినారాయణ(కనిగిరి), ఐ.రామాంజనేయులు(కనిగిరి), వి.వెంకట ప్రణయ్(మార్కాపురం)

క్షణికావేశం.. తీరని శోకం!

- ఫంక్షన్‌కు వెళ్లే విషయమై భార్యాభర్తల మధ్య వివాదం
- పిల్లలకు ఎలుకల మందు పెట్టి తల్లి ఆత్మహత్యాయత్నం
- బాలుడు మృతి.. చికిత్స పొందుతున్న ఇద్దరు కుమార్తెలు



చికిత్స పొందుతున్న సామ్రాజ్యం

నాగులుప్పలపాడు: భార్యాభర్తల మధ్య చోటుచేసుకున్న స్వల్ప వివాదం ఆ కుటుంబంలో వేదన మిగిల్చింది. క్షణికావేశానికి లోనైన మహిళ తన పిల్లలకు ఆహారంలో ఎలుకల మందు కలిపి పెట్టడమే కాకుండా తాను కూడా తినింది. నాగులుప్పలపాడు మండలం రాపర్ల ఎస్సీ కాలనీలో చోటుచేసుకున్న ఈ ఘటనలో నాలుగేళ్ల బాలుడు మరణించాడు. అందిన సమాచారం మేరకు.. రాపర్ల ఎస్సీ కాలనీకి చెందిన పెరికల ప్రవీణ్, సామ్రాజ్యం ఆరేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి యోగి(4), షర్మిల(3), ఏడాది వయసున్న మరో పాప ఉన్నారు. ఒంగోలు మండలం కరవది గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి తీసుకెళ్లమని సామ్రాజ్యం తన భర్తను కోరింది. ఈ నేపథ్యంలో భార్యభర్తల మధ్య ఏర్పడిన వివాదంలో తీవ్ర మనస్తాపానికి గురైన సామ్రాజ్యం(25) ఆదివారం సాయంత్రం అన్నంలో ఎలుకల మందు కలిపి పిల్లలకు పెట్టడంతోపాటు తాను కూడా తినింది. కొంత సమయం తర్వాత ప్రవీణ్ తల్లి ఇంట్లోకి వెళ్లగా సామ్రాజ్యంతోపాటు పిల్లలు స్పృహ తప్పి పడిపోయి ఉన్నారు. వెంటనే బంధువుల సాయంతో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. యోగి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వైద్యులు గుంటూరు జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు. చికిత్స పొందుతూ యోగి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. తల్లితోపాటు మరో ఇద్దరు కుమార్తెలకు ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. తల్లి, ఏడాది వయసు పాప పరిస్థితి విషమంగా ఉంది.

శేష వాహనంపై శ్రీవారు



నైవేద్యాలతో ఉభయదాతలు



శేషవాహనంపై ఉత్సవమూర్తుల పవళింపు సేవ



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: బ్రహ్మోత్సవం..బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవం అంటూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ వెలుగొండలో బ్రహ్మోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. భక్తుల జయజయ ధ్వానాలతో ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు. ప్రసిద్ధపుణ్య క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారికి రోజుకో అవతారంలో ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. సోమవారం శ్రీవారు పల్లకిలో అలంకరించిన శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారికి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ పురవీధులలో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామికి నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉత్సవ ఉభయదాతలుగా మారెళ్ల నాగ వెంకటదిలీప్‌కుమార్, తిరుపతిరావు, వెంకటసుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు దంపతులు వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వేద పండితులు ప్రసాదాచార్యులు, పవనకుమారశర్మ, సింహాద్రిచార్యులు స్వామికి అర్చనలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మంగళవారం శ్రీవారు హనుమంత వాహనంపై శ్రీవారి ఉత్సవ మూర్తులకు ఉత్సవం జరుగుతుందని ఆలయ మేనేజర్ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.

మహిళ మృతదేహం గుర్తింపు

సీఎస్‌పురం: మండలంలోని మిట్టపాలెం గ్రామానికి సమీపంలో ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. ఎస్సై పి.అనీల్‌కుమార్ కథనం మేరకు.. మిట్టపాలెం గ్రామానికి సమీపంలో ఉన్న ఓ జామాయిల్ తోటలో కూలీలు సోమవారం జామాయిల్ కర్ర కొడుతున్నారు. అయితే తోటలో దుర్వాసన రావడంతో పరిశీలించగా ఓ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్సై అనీల్‌కుమార్, సీఐ కె.శ్రీనివాసరావులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఆనవాళ్లు గుర్తుపట్టలేనంతగా మృతదేహం కుళ్లిపోయి ఉంది. 20 రోజుల క్రితం మృతి చెంది ఉంటుందని, మృతురాలి వయసు 60 నుంచి 65 ఏళ్లు ఉంటాయని తెలిపారు. సమీప గ్రామాల్లో ప్రజలను విచారించారు. పలు పోలీస్‌స్టేషన్‌లలో మిస్సింగ్ కేసుల వివరాల గురించి వాకబు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనీల్‌కుమార్